క థా ని క :

# మె ★ కా ★ ని ★ క్

మా ఫ్యాక్టరీ కూలీలే నయం స్ట్రయిక్ స్ట్రయిక్కీ మధ్య ఒక వారమన్నా వ్యవధి తీసుకొంటారు. మా ఫ్యాక్టరీ జనరేటరు వుంది చూశారూ, దాని ధర్మమంటూ ఫ్యాక్టరీలోని మెషిన్సు అన్నీ రోజుకో మారైన స్ట్రయిక్ జేస్తుంటాయి. కనీసం గంటకో అయిదు నిముషాలన్నా రెస్టు తీసుకొంటుంటాయి మెకానిక్‌లకు పెట్టులుబెట్టి నానా తిట్లు తిపిస్తుంటాయి,

ఉదయం ఎనిమిది గంటలకు ఫ్యాక్టరీకి వెళ్ళాను. అప్పటికే మా మెకానిక్ లందరూ జనరేటర్ సెట్‌తో హోరాహోరీ పోట్లాడుతున్నారు. ఆదిలోనే హంసపాదు' తొమ్మిది గంటలవరకు పోరాడి అలసి, అపజయం పొందిన మెకానిక్‌లు వొకరినొకరు కవ్వించుకో మొదలెట్టారు. 'నీబ్రతుకెంతంటే నీ బ్రతుకెంత'అని. కారుహారన్ వింటూనే కలవరపడి ఎవరిపనిలో వాళ్ళు నిమగ్నులైనారు.

ప్రొప్రయిటరు ప్రసాదరావుగారు వరండాలోంచే అక్షింతలు జల్లుతూ వచ్చాడు. "ఉద్యోగంలోంచి వూడబెరకందే తెలియదు ఎందుకూ పనికిరాని దద్దమ్మలు" అంటూ, తలవేలాడేసి నేల జూస్తున్నారు మెకానిక్‌లందరూ, "గెట్ అవుట్" ఓ పెద్ద ఉరుము వురిమినట్లయింది. చిన్నబోయిన ముఖాలతో నిష్క్రమించారు మెకానిక్ లందరు.

ఇప్పటికి షుమారు పది సంత్సరాల క్రితం నేటి మా వోనరు పూజ్య జనకులు, కీర్తిశేషులైన శ్రీభుజంగేంద్రరావుగారు తమ ఫ్యాక్టరీలో పనిజేస్తున్న ఛీఫ్ మెకానిక్‌తో పోట్లాడి-అతనిని బయటికి గెంటించాడు. ఎప్పటికైనా వొకరిమీద ఆధారపడటం బాగుండదని. తన ఏకైక పుత్రుని పై చదువులకు విదేశాలకు పంపాడు. కాని, విద్య పూర్తయి, ఆయన తిరిగి రాకముసుపే భుజంగేంద్రరావు పరలోకానికి ప్రయాణం కట్టారు ఓ సంవత్సరం క్రితం ప్రసాదరావుగారు తిరిగివచ్చారు. ఇప్పుడు అతనే మా ఫ్యాక్టరీ వోనరూ, ఛీఫ్ మెకానిక్.

పదిగంటలు కావస్తూంది. జనరేటర్ సెట్ వున్న రూము వద్దకు మెల్లగా బోయాను. ప్రసాదరావుగారు జనరేటర్ సెట్‌తో నానా తంటాలు పడుతున్నారు. చాలా పట్టుదలతో పనిజేస్తున్నాడు. చేతులు, ముఖం అంతా మసిమయం. లోపలికి పోయేందుకు భయపడి తిరిగి వచ్చేశాను. ఈరోజు ఎవరికి ఉద్వాసన వుంటుందో తెలియటంలేదు 'దిన దిన గండం, నూరేళ్ళ ఆయుష్షు'లా వుంటుంది మా ఫ్యాక్టరీ ఉద్యోగము.

ర చ న :

## వలమేటి సుందరరామయ్య

'నమస్తే సార్' బక్కపల్చగా, పీచు గడ్డంతో అతివినయంగా నిల్చొని వున్నాడో మనిషి. 'ఏమి కావాలి' అన్నట్లు తల వూపాను. 'ఉద్యోగంకోసం సార్' అన్నాడు. మా ఉద్యోగాలే వుంటాయో, వూడుతాయో తెలియక చస్తుంటే, యితనికి ఉద్యోగం కావాలట !

'గేటు ముందు బోర్డు కనిపించడంలే?' అడిగాను.

'ఎక్కడికిబోయినా అది మామూలే సార్! 'నో వేకన్సీ' బోర్డు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. తమరేదైన దయచలుస్తారని...'

'దయదలచినట్లే వుంది మా పని. ఇక తమరు దయచేయవచ్చు' అన్నాను. అతను తిరుగుముఖం బెట్టేడు.

'ఎవరతను?' వెనుదిరిగి జూచాను. మా ప్రొప్రయిటరుగారు. 'ఉద్యోగం కావాలట సార్' అన్నాను.

'ఏం పని చేస్తావ్' అడిగాడతన్ని.

'మెకానిక్‌ని సార్' అడిగాడతను.

'నాతో రా' అంటూ జనరేటర్ సెట్ వున్న హాల్‌లోకి దారి తీశాడు.

'ఈ జనరేటర్ సెట్‌ని అరగంటలోగా రిపేరు చేయగలిగావో నీకు నెలకు మూడు వందలు రూపాయలు జీతమిస్తాను. అలా చేయలేకపోయావో గేటు తలుపులు తీసే వున్నాయి' అంటూ వచ్చేశాడు మా ప్రొప్రయిటర్. క్రొత్తతను మెకానిక్కో, మెజీషియనో తెలియదుగాని, మేము పది అడుగులు వేశామో లేదో జనరేటర్ సెట్ స్టార్టు కావడం, ఫ్యాక్టరీలోని అన్ని మెషన్లు పనిజేయడం జరిగింది

నెలకు మూడువందల రూపాయలు జీతము మీద ఐదు సంవత్సరాలకు అగ్రిమెంటు వ్రాయించుకొన్నాము. అరగంట క్రితం అడుక్కుతింటున్న అభాగ్యుడు, యిప్పుడు నెలకు మూడువందల రూపాయలు జీతగాడు. అతన్నిజూస్తే నాకెందుకో యీర్ష్యగానే వుంది. ఫ్యాక్టరీ మేనేజరుగా పదియేండ్ల నుంచి పనిజేస్తున్న నాకు, నెలకు నూటపాతిక జీతంతోపాటు వో పాతికైన క్రొత్త క్రొత్త తిట్లు లభిస్తుంటాయి.

మరుసటిరోజు క్రొత్త మెకానిక్ డ్యూటీకి వచ్చాడు. చింపిరి గడ్డం, చినిగిన షర్టుతో నిన్న దర్శనమిచ్చిన యితను, ఫుల్ సూట్‌లో వచ్చాడు. ఫ్యాక్టరీ మేనేజరునైన నేను వస్తుంటేనే, చూచి చూడనట్లు తల ప్రక్కకు త్రిప్పుకొని, గేటు కానుకొని, ఈలపాట పాడుకొనే మా వాచ్‌మెన్ ఈ మెకానిక్‌ని చూడగనే 'అటెన్షన్'లో నిల్చొని వో మిల్టరీ సెల్యూట్ కొట్టేడు. మెకానిక్ సరాసరి ఫర్నెస్ హాల్ దగ్గరకుపోయి, తక్కిన మెకానిక్‌లకు ఆర్డర్సు జారీ చేశాడు. కూలీల మీద పెత్తనం చెలాయించడం మొదలెట్టేడు. తమాషా ఏమిటంటే, ఫ్యాక్టరీ వోనరుగారే ఎవరినైన వర్కరుని దబాయించి వెళ్ళిపొమ్మంటే తమకూ ఫ్యాక్టరీలో కొంత హక్కు వుందనీ, అవసరమైతే వుంచుకొని, తర్వాత పొమ్మంటే పోమని ఏకతాటిమీద ఎదురు తిరిగే మా వర్కర్సు, యీ క్రొత్త మెకానిక్ ఎలాజెపితే అలా జేస్తున్నారు.

ఏదోలాగ వచ్చి మేకై కూర్చున్నాడీ మెకానిక్. ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ వొకటి బెట్టాడు. ఆ యూనియన్‌కి ప్రెసిడెంటుగా తానే ఎన్నుకో బడ్డాడు. చీటికి మాటికి ప్రొప్రయిటరు వద్దకు పోవడం, వర్కర్సుకి ఆ వసతులు లేవు, యీ వసతులులేవు అని పేచీలు పెట్టడం మొదలెట్టేడు. వర్కర్సుకి మంచినీటి వసతి లేదని, మధ్యాహ్నం భోంచేసేందుకు ఏలాంటి వసతులు లేక ఫ్యాక్టరీ ముందు, రోడ్డుమీద భోంచేస్తున్నారని వొకరోజు, ఫ్యాక్టరీలో వర్కర్సుకి లెట్రిన్సులేవని యిందువలన ముఖ్యంగా ఆడకూలీలు చాలా బాధ పడుచున్నారని, తక్షణం లెట్రిన్సు కట్టివ్వాలని యింకోరోజు. రోజురోజుకో సమస్య లేవదీస్తున్నాడు.

ఇతని ప్రవర్తనకు మా ప్రొప్రయిటరు గాబరా పడ్డారు. వీడిని ఎలా వదిలించుకోవాలో మాకు అర్థం గాలేదు యిప్పుడతనే కూలీల నాయకుడు. ఏ క్షణాన సమ్మెలు జరుపుతారో తెలియడంలేదు. ఇతనిచేత ఐదు సంవత్సరాలు అగ్రిమెంటు వ్రాయించుకొన్నందు వలననే వచ్చిందీచిక్కు ఇప్పుడు కొరకరాని కొయ్యలా తయారైనాడు తన రూములోనికి చీటికిమాటికి రావద్దని ప్రొప్రయిటరు ఎన్నోమార్లు నయాన భయాన చెప్పి చూచాడు. కాని అతను రోజుకో క్రొత్త సమస్య తీసుకురావడం, ప్రొప్రయిటరు గారిని వేధించడం, తర్వాత ఆయన నన్ను పిల్చి ఆ కోపమంతా నా మీద చూపడం పరిపాటై పోయింది.

మెకానిక్ జేస్తున్న పనులు కొన్ని అనుమానాస్పదంగా వుంటే, నాకనుకూలంగా వున్న వో వర్కరును గూఢచారిగా నియమించాడు. నా అనుమానమే నిజమైంది. తిన్న యింటికి వాసాలు లెక్కబెట్టే రకమైనాడు యీ మెకానిక్. ప్రొప్రయిటరుగారి మరదలు, కాబోయే శ్రీమతి, ప్రమీలతో ప్రణయ కలాపాలు సాగిస్తున్నాడట. ప్రొప్రయిటరు లేనప్పుడు వాళ్లయింటికి పోవడమే కాక, ప్రమీలతో బీచ్‌లకు, సినిమాలకు బోతున్నాడట. ఛీ! ఛీ! ఆ అమ్మాయికి మటుకు ఆమాత్రం బుద్ధిలేదూ? తనకు ప్రసాదరావుతో వివాహం ఎప్పుడో నిశ్చయమై పోయింది. పెండ్లి ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఇంకా కొద్ది రోజులలో ఆ మూడుముళ్ళూగూడ పడబోతున్నాయి. ఇంతలో యీ దుర్బుద్ధి ఎందుకు పుట్టిందో యీమెకు. యింతకూ 'వంట బ్రాహ్మణుని లా వచ్చి యింటిబ్రాహ్మణుడైనట్లు' వుంది మా మెకానిక్ వరుస.

ఇంట్లో మా ఆవిడతో వేగలేక వుదయం ఏడుగంటకే ఫ్యాక్టరీకి పోయాను. గేటువద్ద వాచ్‌మెన్ లేడు. ఫ్యాక్టరీ నిశ్శబ్దంగా నిద్రపోతోంది. నా గదిలోకిపోయికి కూర్చున్నాను, ఎదురుగా జూస్తే మా ప్రొప్రయిటరు గారి గదికూడా తెరచే వుంది. అతను యింత పెందలకడనే వచ్చాడా లేక రాత్రి వాచ్‌మెన్ తలుపులు వేయడం మరచాడా? ఎందుకో నాకనుమానం వేసింది. మెల్లగా ఆఫీసుగది వద్ద కెళ్ళాను. లోపలనుంచి గుసగుసగా మాటలు, సన్నని కిలకిల నవ్వులు వినిపిస్తున్నాయి. లోనికి తొంగిజూచాను. నా కళ్ళను నేనే నమ్మలేక ఇంకోమారు కండ్లు నలుముకొని జూచాను. మెకానిక్ గాడ్రేజ్ బీరువానుంచి ఏంటో బాండు పేపరాలు తీస్తున్నాడు. టేబిల్ సొరుగులు తెరచి వున్నాయి. గదంతా కాగితాలు చిందరవందరగా పడివున్నాయి. ప్రమీల అతని కేవో కాగితాలు వెదికియిస్తూ, మధ్య మధ్య సరసాలు ఆడుతూంది. ఎంత మోసం లోనికిబోయి వాళ్ళను పట్టుకోగలిగే సాహసం నాకులేదు నా గదికొచ్చి మా ప్రొప్రయిటరు గారికి, పోలీసు స్టేషనుకు ఫోన్ జేశాను.

క్షణమొక యుగంలా వుంది నాకు. ఎంతకూ పోలీసు బందోబస్తుగాని, మా ప్రొప్రయిటరుగాని రాలేదు ఈ గుండా లెక్కడ వెళ్ళిపోతారో నాకు భయంగావుంది. వీళ్ళను వున్నపళంగా పట్టుకోవాలంటే ఫ్యాక్టరీలో మనుష్యులెవరూ లేరు. వాచ్‌మెన్ ఎక్కడున్నాడో తెలియడంలేదు. ఇంకో అర్ధగంటైనా గడవందే వర్కర్సుగూడ రారు.

ప్రసాదరావు కారులోంచే దుమికి పరుగెత్తేరు. నేను జెప్పేదిగూడ వినే మూడ్‌లో లేడతను. సరాసరి తన గదివైపు పరుగెత్తాడు. ఏవో కొన్ని కాగితాలు చేతిలో పట్టుకొని, మెకానిక్, ప్రమీల వాకిట్లోకి ఎదురొచ్చి, మమ్మలని జూచి ఆగిపోయారు. వీళ్ళను జూస్తేనే మా వోనరు వొక పెడబొబ్బబెట్టి మెకానిక్‌పైకి లంఘించాడు. అతనూ సిద్ధంగానే వున్నట్లున్నాడు. ప్రొప్రయిటర్ గారి చేతిని అట్టే పట్టుకొని మెలిత్రిప్పి, డొక్కలో వొకటిచ్చాడు. ఇంతలో యిన్‌స్పెక్టరుగారు బూట్ల టక టకలతో, తన బృందంతో రంగంలోకి దూకాడు.

'ఇన్‌స్పెక్టరుగారూ! వీడేనండి ఆ దుర్మార్గుడు. వీడ్ని అరెస్టు చేయండి' అంటూ మెకానిక్‌ని జూపెట్టాను. ఇన్‌స్పెక్టరు మెకానిక్‌నో మారుజూచి, విష్ చేసి, మా ప్రొప్రయిటర్ ప్రసాదరావుగారికి బేడీలు తగిలించాడు. అసలు నాకళ్ళ ముందు ఏమిజరుగుతుందో నాకర్థంగావడంలేదు. అప్పుడప్పుడే ఫ్యాక్టరీకి వస్తున్న వర్కర్సు తమ వోనరుకు బేడీలు పడి వుండడంజూచి ఆశ్చర్యబోతున్నారు.

'ఆశ్చర్యబోతున్నారా మేనేజరుగారూ!' అంటూ నాభుజం తట్టాడు ఇన్‌స్పెక్టరు.

'ఇన్ని రోజులుగా, మీ ఫ్యాక్టరీ వోనరులా చెలామణి ఔతున్న యీ దుర్మార్గుడు వో గజదొంగ. భుజంగరావు చనిపోగానే, తనే ప్రసాదరావులా వచ్చి మిమ్మలనందరిని మోసపుచ్చాడు. ప్రమీలకు చిన్ననాటి తన బావ రూపము సరిగా జ్ఞప్తి లేనందున ఆమె గూడ మోసపోయింది. ఈ దుర్మార్గుడు ప్రసాదరావు ఉత్తరాలకు మేనేజరు పేరుతో జవాబులుగూడ పంపేవాడు. తండ్రి చనిపోయినతర్వాత, ఫ్యాక్టరీ స్థితిగతులు ఎలా మారాయో తెలుసుకోవాలని, తను ముందుగా వస్తున్నట్లు తెలుపకుండానే ప్రసాదరావు విదేశాలనుండి దిగాడు. ప్రసాదరావు రాకను ముందుగా తెలుసుకొని పరారీగావలచిన గజదొంగకు యీ విషయం తెలియదు. తన పేరుతో ఎవరో మోసగాడు చెలామణీ గావడం తెలుసుకొని, మాపోలీసు డిపార్టుమెంటుతో సంప్రదించాడు. ప్రసాదరావు మాసలహామీదనే, యీ ఫ్యాక్టరీలో మెకానిక్ గా జేరి, గజదొంగయొక్క ముఠా రహస్యాలు తెలుసుకొన్నాడు ఇతనే అసలు ప్రసాదరావని మాద్వారా తెలుసుకొన్న ప్రమీల యీ విషయంలో అతనికి బాగా సహకరించింది. వాళ్ళ పుణ్యమంటూ మేమొక గజదొంగ ముఠాను పట్టగలిగాం.'

ఆశ్చర్యంతో నానోరు తెరచుకపోయింది. అసలు ప్రసాదరావు కాళ్ళపై వాలిపోయాను.